క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో పార్వతీదేవి



పండ్లు, కూరగాయల దండలతో అలంకరించిన అమ్మవారు

రామన్నపేట : మండలంలోని వెల్లంకి శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైఉన్న పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిదేవిగా అలంకరించారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఉద్యోగులు

రామన్నపేట : రామన్నపేట ఎంపీడీఓగా ఎ.రాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా పాలకుర్తి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై రామన్నపేటకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన బి.యాకుబ్‌నాయక్ నల్లగొండకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన రాములును కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవూఫ్‌అలీ, ఏపీఓ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ ఎంపీడీఓగా జలంధర్ రెడ్డి



వలిగొండ : వలిగొండ ఎంపీడీఓగా జలంధర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మోత్కూరు ఎస్ఐగా సతీష్



మోత్కూరు : మోత్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కొంపెల్లి సతీష్ శుక్రవారం సతీష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కోక భిక్షంకు సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న కోక భిక్షం

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు డాక్టర్ కోక భిక్షంకు మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే భారత్ సేవా రత్న జాతీయ అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లో త్యాగ రాజ గాన సభ కళా వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, ఈఎస్ నలపరాజు, రాజేంద్రకుమార్, ప్రణయ్, దైవాజ్ఞశర్మ, శివలీల, సింగర్ అర్చన తదితరులు ఉన్నారు.

కూలర్ బహూకరణ



కూలర్ బహూకరిస్తున్న గొంగిడి సునీత

ఆలేరు : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతారెడ్డి శుక్రవారం కూలర్‌ను బహూకరించారు. ఆమె వెంట ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేష్‌గౌడ్, రమణారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్

యాదగిరిగుట్ట రూరల్: ఫార్మసీ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్వామి వివేకానంద కళాశాల డైరెక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.హేమామాలిని అన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని స్వామి వివేకానంద కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కె.రాజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షణక్షణం.. భయం భయం

- గ్రామాల్లో ఇళ్ల పైనుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ లైన్లు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్న ప్రజలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సైతం అడ్డంకిగా మారిన వైనం



ఆరెగూడెంలో ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలు ఉండడంతో నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఇళ్ల పైనుంచి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికి అందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు జంకు తున్నారు. మండలంలోని అల్లాపురం, ఆరెగూడెం గ్రామాలతో పాటు మరో 10 గ్రామాల్లో ఇళ్ల పైనుంచి తక్కువ ఎత్తులో 11కేవీ విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని లైన్లు ఏకంగా బిల్డింగ్‌ల మీదుగా, మరికొన్ని ఇళ్లకు దగ్గరగా ఉండడంతో ఇళ్ల యజమానులు క్షణక్షణం భయం భయంగా గడుపుతున్నారు. పిల్లలు ఎక్కడ ఇంటి మీదకి వెళ్లి కరెంట్ తీగలను పట్టుకుంటారో అని హడలిపోతున్నారు. మండలంలోని ఎల్లంబావి గ్రామంలో సంక్రాంతి పండుగకు పతంగులు ఎగరవేస్తు ఇంటిపై ఉన్న మెయిన్ విద్యుత్ లైన్ తీగలు తగిలి ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఇంటి పైనుంచి ఉన్న విద్యుత్ లైన్‌ను మాత్రం మార్చలేదు. ఆరెగూడెం గ్రామంలో ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని పదేళ్లుగా గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇళ్లు తడిచి కరెంటు సరఫరా అయిన ఘట నలు సైతం ఉన్నాయని.. ఈదురు గాలులకు తీగలు తగులుకుని మంటలు వస్తుండడంతో భయపడుతూ ఇళ్లలో ఉండాల్సి వస్తోందని పలువురు స్థానికులు వాపోతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా..

ఆరెగూడెం, అల్లాపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి విద్యుత్ తీగలు అడ్డంకిగా మారాయి. ఆయా గ్రామాల్లోని పలువురు లబ్ధిదారుల ఖాళీ స్థలాల మీదుగా 11కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. దీంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పిల్లర్ గుంతలు తీసి ఆపేశారు. అల్లాపురంలో పిల్లర్లు కొంత ఎత్తుకు లేపి నిలిపి వేశారు. విద్యుత్ తీగలను షిఫ్ట్ చేయాలని అధికారులకు విన్నవిస్తే విద్యుత్ తీగలు తొలగించడానికి కావాల్సిన నిధులు లేవని సమాధానం చెబుతున్నారని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వాపోతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు ఉంటూ వెంటనే ఆ తీగలను షిఫ్ట్ చేయాలని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. అయినా విద్యుత్ అధికారులు మాత్రం ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. నెల నెలా విద్యుత్ బిల్లులను వసూలు చేయడంపై అధికారులు చూపుతున్న శ్రద్ధ ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంలో చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడే తీగలను తీగలను షిఫ్ట్ చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు ఏదో ఒక సాకు చూపుతూ నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థలకు మాత్రం ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న.. లైన్లు షిఫ్ట్ చేయాలన్నా మాముళ్లు తీసుకుని వెంటనే పని పూర్తి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలను షిఫ్ట్ చేయాలని పలువురు కోరుతున్నారు.

నిధులు విడుదల కాలేదు

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల మీదుగా ఉన్న విద్యుత్ తీగలు తొలగించాలని వినతి పత్రాలు వచ్చాయి. వాటి ఆధారంగా విద్యుత్ తీగలు షిఫ్ట్ చేయడానికి ఎస్టీమేషన్ వేసి ప్రభుత్వానికి పంపించాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. ఇందిరమ్మ ఇళ్ల మీదుగా ఉన్న తీగలను త్వరలోనే తొలగించేలా చర్య తీసుకుంటాం. – సతీష్, చౌటుప్పల్, ఏఈ

ఇబ్బందులు పడుతున్నాం



మా ఇంటి పైనుంచి విద్యుత్ తీగలు ఉండడంతో నాలుగు రూమ్‌లు కట్టుకునే పరిస్థితి లేక రెండు రూమ్‌లు నిర్మించుకున్నాం. వర్షాలకు గాలులకు కరెంట్ తీగలు తగులుకుని మంటలు వస్తున్నాయి. ఇంట్లో ఉండాలంటే భయంగా ఉంది. పదేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్న కూడా తీగలు తొలగించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలు షిఫ్ట్ చేయాలని కోరుతున్నాం

– ఉప్పలపల్లి గాలమ్మ,ఆరెగూడెం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ప్రభుత్వ విప్



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు రానివారికి రెండో విడత ఇళ్లు ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, కొండ్రాజు వెంకటేశ్వరరాజు, గందమల్ల అశోక్, సాగర్‌రెడ్డి, తుంగ కుమార్, బుగ్గ నవీన్, వట్టిపల్లి శ్రీనివాస్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి



ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరుతూ శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు సుర్కంటి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఓ శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహకంతో పాటు పరివాహకయేతర గ్రామాల్లో 30 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే నాట్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. ప్రస్తుత దశలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అవసరం ఉంటుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా ఎరువులన్నింటిని అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, అసెంబ్లీకన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లాకమిటీ సభ్యుడు పల్లెకాడి బస్వయ్య, కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, నాయకులు గంజి బస్వలింగం, గుమ్మి దామోదర్‌రెడ్డి, భగవాన్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆత్మకూరు(ఎం): మహిళలు ఆర్థికంగా ఎదగాలి అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా సమాఖ్య మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్త్రీనిధి రుణాలతో, బ్యాంక్ లింకేజీ రుణాలతో స్వయం ఉపాధి పథకాలను ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని మెరుగుపర్చుకోవాలన్నారు. జిల్లాలో స్త్రీనిధి రుణాలను రూ. 69కోట్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమ భావన సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించి, సంఘాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రచ్చ పల్లవి, ఏపీఎం పక్కీరయ్య, సీసీలు వెంకన్న, లోడి భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర స్వామి పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి



భూదాన్‌పోచంపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

భూదాన్‌పోచంపల్లి : జనాభా పెరుగుదలను తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని మండల వైద్యాధికారిణి శ్రీవాణి, సీహెచ్‌ఓ పోతారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్య, నాణ్యమైన జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు అరుంధతి, శ్రీనివాస్, లక్ష్మణ్‌బాబు, బేగ్, జానకి పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్, నర్సింహ, అంజుమ్, సందీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని సీతారాంపురం గ్రామంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నవ్య, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఐతరాజు గిరివర్ధన్, ఉపాధ్యాయులు వెంకట్‌రామ్‌రెడ్డి, హేమలత, సుధారాణి, వెంకటేష్, రేణుక, ఏఎస్‌ఎం వాణి, ఏడబ్ల్యూటూ లావణ్య, కవిత పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపొద్దు

రామన్నపేట : తల్లిదండ్రులు లింగవివక్ష చూపొద్దని రామన్నపేట ఏరియా ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వీరన్న, మండల విద్యాధికారి అశ్వినికుమార్ అన్నారు. మునిపంపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌సెంటర్ల వైద్యులు శివ, చాందస్వి, వెంకట్, రాణి, శాలిని సూపర్‌వైజర్లు చంద్రకళ, గోపాల్, వాణిశ్రీ, మల్లేశం, ఎఎన్‌ఎంలు మంజుల,గౌసియా, గీత, ఆదిలక్ష్మి, రజిత, శ్యామల, సునీత, సంధ్య, ప్రశాంతి, స్వరూప, విజయ, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

యాదగిరిగుట్ట : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా యువ భారత్ తెలంగాణ, ఫ్రెండ్స్ యూత్, గంగాధర యూత్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం సమక్షంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల, మేరా యువ భారత్ జిల్లా వలంటరీ అంబేద్కర్, గ్లోబల్ యూత్ ప్రెసిడెంట్ బుగ్గ శ్రీకాంత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మోటారు అందజేత

బొమ్మలరామారం : మండలంలోని ఖాజీపేట్ గ్రామానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమకూర్చిన మోటారు సామగ్రిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాసారం బాబు, నాయకులు బాసారం శ్రీరాములు, పల్లెపాటి రాములు, రామిడి శ్రీకాంత్ రెడ్డి, శాగంటి సత్యనారయణ, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు, శ్రీనివాస్,రమేష్, జానార్దన్, అంజనేయులు, సత్తి రెడ్డి, బాబు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ రద్దుచేయాలి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని పదవ బ్లాక్‌లో 10–91/1 నంబర్ గల ఇంటి నంబర్‌ను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎంపీడీఓ రాములు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గజరాజు కాశీనాథ్, బీసు చందర్ గౌడ్, కోరె భిక్షపతి, మజ్జిగ నరేష్; మజ్జిగ రాంబాబు, కోరె శ్రీశైలం,సోమయ్య, కనకయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

ఆత్మకూరు(ఎం): స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత, నాయకులు సోలిపురం అరుణ, నాగరాజు, శ్యంతన్‌రాజు, గుడ్డెటి శ్రీను, నాతి మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ

వలిగొండ : మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌లోని వైశ్యభవన్ సహకారంతో శుక్రవారం బ్యాగులు, నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ గుప్తా, బలరాం, పాండురంగం, అనురాధా, జ్యోతిలక్ష్మి, మహాలక్ష్మి, కస్తూరి, కేశవ లాల్, అరుంధతి, సరిత, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : ఈనెల 13, 14 తేదీల్లో గద్వాల్ పట్టణంలో నిర్వహించనున్న ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు షేక్ మీర్ యూసుఫ్ అలీ, ఎండీ సలీం ఆవాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం లోని సుందరయ్య భవనంలో మహాసభలకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముక్తార్ హుస్సేన్, ఇక్బాల్, ఎండీ సైఫ్, ఎండీ సాజిద్, ఎండీ నిహాల్, ఎండీ రియాజ్ ఉన్నారు.

విద్యాసాగర్‌కు నివాళి

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ చిప్పలపల్లి రవీందర్ కుమారుడు చిప్పలపల్లి విద్యాసాగర్ (31) మృత దేహాన్ని శుక్రవారం పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు దాసరి తిరుమలేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, గడ్డం నర్సింహ , జిట్ట సాయి, దాసరి నవీన్, కొంగరి నవీన్, యాకస్వామి, మల్లేష్, రామచంద్రు, దశరథ, కనకయ్య, జిట్ట రాములు, నర్సింహ, జిట్ట భిక్షం పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలి

రామన్నపేట : పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ శైలజకు వినతిపత్రం అందజేశారు. స్కాలర్ షిప్‌లు, ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టల ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, సాయికుమార్, వందన, చరణ్, శివ, నవదీప్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



రామన్నపేట : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణ కేంద్రంలో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. గత పాలకులు బీసీల రిజర్వేషన్లు అణచివేతకు గురి చేశారన్నారు. బీసీలంతా కాంగ్రెస్ వైపు ఉండాలన్నారు. గత ప్రభుత్వం బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు బిక్షపతి, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్, గౌళికార్ రాజేష్, జానకిరాములు, గాంధీ తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

రామన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జమీరొద్దిన్, జినుకల ప్రభాకర్, గోదాసు పృద్వీరాజ్, వనం చంద్రశేఖర్, ఎండీ నాజర్, కోట సుధాకర్, లెంకల ప్రవీన్, మోటె రమేష్, బొడ్డు సురేందర్, బషీరుద్దొలా, మోటె మహేష్, కొత్తపల్లి అబ్రహం, నోముల ప్రవీన్, మద్దెపురి ఐలయ్య, లవనం సాయి, గంగాపురం శంకర్, ఆముద లక్ష్మన్, గురుకు శివ, మినుముల సందీప్, ఎండీ ఖరీం పాల్గొన్నారు.

మంత్రి వర్గ నిర్ణయంపై హర్షం

మోత్కూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు కలిమెల నర్సయ్య, శివార్ల శ్రీనివాస్, నిలిగొండ మత్స్యగిరి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న లింగారెడ్డి

భువనగిరి : విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి కామిక్ రైటింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కామిక్ రైటింగ్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ అండాలు, ఉపాధ్యాయులు ఎస్ కృష్ణారెడ్డి, సాబేరా, ఎస్ కృష్ణ ఉన్నారు.

జిల్లా స్థాయిలో ఎంపికైన వారు..

మొదటి స్థానంలో ఎస్ రవళిక(7వతరగతి, జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు (యాదగిరిగుట్ట), ద్వితీయ యామిని(9వ తరగతి జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు యాదగిరిగుట్ట), తృతీయ స్థానంలో అశోక్(10వతరగతి, జెడ్పీహెచ్‌ఎస్ రాయగిరి) ఉన్నారు.

క్యాన్సర్‌తో పోరాడి ఓడిన చిన్నారి

– మూడు నెలలుగా చికిత్స పొందుతూ షేక్ ఐరా మృతి



షేక్ ఐరా (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని వంక మామిడి గ్రామానికి చెందిన 16 నెలల చిన్నారి షేక్ ఐరా క్యాన్సర్‌తో మూడు నెలలు పోరాడి శుక్రవారం మృతి చెందింది. వివరాల ప్రకారం.. మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన షేక్ జమాల్‌కు కూతూరు షేక్ ఐరాకు 8 నెలల క్రితం తీవ్రమైన జ్వరం రాగా ఆసుపత్రుల్లో చూపించిన తగ్గలేదు. మరోవైపు కడుపు ఉబ్బి పాలు తాగడానికి ఇబ్బంది పడుతుండగా పరీక్షలు నిర్వహించారు. కాగా ఐరాకు జువైనల్ మైలో మోనోసైటిక్ లుకేమియా అనే క్యాన్సర్ ఉందని తేలడంతో బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో చేర్పించారు. మూడు నెలలుగా చికిత్స అందిస్తున్నారు. చిన్నారికి కీమోథెరపి, ఇతర వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో శుక్రవారం తుది శ్వాస విడిచింది. కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మహబూబ్‌పేట, మల్లిగూడెం, చొల్లేరు గ్రామాల్లో శుక్రవారం పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను, ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు గుంటిపల్లి మహేశ్వరి సత్యనారాయణ, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఏలూరి సత్యనారాయణ, మహేష్, నారాయణ, సునీత, రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోని నాలాపై చేపట్టిన అక్రమ కట్టడాలను నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం రాంనగర్, శాంతినగర్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాలాపై నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో రాంనగర్, శాంతినగర్‌కాలనీలు పూర్తిగా నీట మునిగే ప్రమాదం ఉందని వినతిప్రతంలో పేర్కొన్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నాలాపై రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తొర్పునూరి నర్సింహ, కడెం వెంకటేష్, కళ్లెం నాగరాజు, మహేష్, తొర్పునూరి లింగస్వామి, చెర్కు లింగస్వామి, మార్గం లింగస్వామి, సందగళ్ల నాగరాజు, బండ్ల రామకృష్ణ, మారగోని ప్రవీణ్, రాఖేష్, మహేష్ పాల్గొన్నారు.

అనుమతి లేని బోర్ సీజ్

మోత్కూరు : మోత్కూరు మండలంలోని అనాజీపురం గ్రా మంలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన బండ మల్లయ్య వేసిన వ్యవసాయ బోరును శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కుమ్మరికుంట్ల శేఖర్‌రెడ్డి, కుమ్మరికుంట్ల అవినాష్‌రెడ్డి తండ్రి కుమారులు తన బోరు పక్కనే మరో బోరు వేశారని ఫిర్యాదు చేయడంతో తహసిల్దార్ పి.జ్యోతి ఆదేశాల మేరకు అనుమతి లేకుండా బండ మల్లయ్య వేసిన బోరును, కరెంటు, స్టార్టర్లను విచారణ జరిపి సీజ్ చేసినట్లు గిర్దవార్ దాసరి శ్రీనివాస్ తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

బొమ్మలరామారం : ఈ నెల 22, 23న నిర్వహించనున్న గొర్రెల, మేకల పెంపకందారులు సంఘం (జీఎంపీఎస్) జిల్లా మహా సభలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్ర వారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దయ్యాల నర్సింహ, మద్దె పురం రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, చిరంజీవి, మోటే రమేష్, గణేష్, క్రిష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

వలిగొండ : మండలంలోని లోతుకుంట గ్రామంలో బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి స్థల పరిశీలన చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ దశరథ, ఆర్ఐ కరుణాకర్ రెడ్డి, సర్వేయర్ బీక్యా నాయక్ తదితరులు ఉన్నారు.

సంతకాల సేకరణ



సంతకాలు సేకరణలో పాల్గొన్న నాయకులు

రామన్నపేట: రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం శివారుల్లో అదానీ సంస్థకు చెందిన కాలుష్య కారకమైన కంపెనీలకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. అదానీ సంస్థ ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించాలని, సంస్థ ఏర్పాటు చేసే కంపెనీల గురించి గ్రామసభలు నిర్వహించి ప్రజలకు తెలియ జేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక కోకన్వీనర్ ఎండీ రెహాన్, జినుకల ప్రభాకర్, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, జెల్ల వెంకటేశం, ఎండీ జమీరొద్దిన్, ఎండీ అక్రం, ఎం రమేష్, పెద్దగోని వెంకటేశం, ఎండీ నాజర్, గౌలుసుల ప్రసాద్, కోట సుధాకర్, బొడ్డు సురేందర్, కొమ్ము శేఖర్, కూనూరు కృష్ణ, లెంకల ప్రవీన్ పాల్గొన్నారు.